క్లుప్తంగా

ఐదు అడుగుల ఎత్తుకు మించి విగ్రహాలు పెట్టొద్దు

బిక్కవోలు: వినాయక చవితి మంటపాల్లో ఐదు అడుగులకు ఎత్తుకు మించి విగ్రహాలను పెట్టవద్దని ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం పందల పాక పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. మైక్, విద్యుత్ తదితర వాటిని నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి సూరిశెట్టి సురేష్, గుణం శ్రీనివాస చౌదరి, మాజీ ఎంపీటీసీ సబ్బెళ్ల విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

గాంధేయ మార్గంలో రుణాల వసూలు

రాజానగరం: మండలంలోని కానవరం సహకార సంఘం పరిధిలోని కానవరం, తోకాడ, మల్లంపూడి, పల్ల కడియం, రాజానగరం, వెలుగుబంద, చక్రద్వారబంధం గ్రామాల్లో 25 మంది రైతుల వద్ద రూ.4.50 కోట్లు వరకు మొండి బకాయిలు ఉన్నాయి. కొంత కాలంగా వీటి వసూలుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా వసూలు జరగలేదు. దీంతో బకాయిదారుల ఇంటి ముంగిటకు వెళ్లి 'తీసుకున్న అప్పులు వెంటనే చెల్లించాలి, చెల్లించాలి' అంటూ సహకార సంఘం సిబ్బంది ప్లకార్డులు పట్టుకుని నినాదాలిస్తూ శాంతియుతంగా వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజన్ ఏజీఎం శ్రావణి, నోడల్ అధికారి ఉమా రాణి, ఇంటర్నల్ ఆడిటల్ భార్గవ్ కుమార్, మేనేజర్లు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోండి

బిక్కవోలు: రైతు సేవా కేంద్రంలో పంట వివరాలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శామ్యూల్ జాన్ అన్నారు. బలభద్రపురం, కాపవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేయించుకోకపోతే ప్రభుత్వ పథకాలకు అర్హత ఉండదని తెలిపారు. ఎకరానికి రూ.577 చొప్పున చెల్లించి బీమా చేయించుకోవాలని, దానికి ఈ నెల 15వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో బలభద్రపురం నీటి సంఘం అధ్యక్షుడు నల్లమిల్లి సుబ్బారెడ్డి, ఏఈవో కె.శ్రీనివాసు, వీఏఏలు శరత్ తేజ, శిరీష్ పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

రంగంపేట: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వడిశలేరు ఉన్నత పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ధూమపానానికి వ్యతిరేకంగా సంతకాలు చేయించిన విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు.

సీతానగరం: మండలంలో 98.11 శాతం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్టు సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఏవీకె చైతన్య తెలిపారు. సీతానగరం ఎంపీపీ స్కూల్లో సర్పంచ్ కోండ్రపు ముత్యాలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వీవీ సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు.

'పులివెందుల'లో టీడీపీ అరాచకాలు

- రెడ్ బుక్ రాజ్యాంగం అమలు
- టీడీపీ గుండాల రిగ్గింగ్
- విలేరులతో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో అధికార టీడీపీ అరాచకాలు పరాకాష్టకు చేరాయని అనపర్తి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పులివెందుల ఉప ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందన్నారు. టీడీపీ రౌడీ గుంపులు భారీ ఎత్తున రిగ్గింగ్‌కు పాల్పడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గెలవలేమని తెలిసి తప్పుడు పద్ధతులకు పాల్పడ్డారన్నారు. వైఎస్సార్ సీపీ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించకుండా, బూత్ లోపల ఉన్న ఏజెంట్లను బయటకు లాగిపడేశారన్నారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి బూత్‌లలోకి వెళ్లి చట్ట విరుద్ధంగా జోక్యం చేసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను హౌస్ అరెస్ట్ చేశారని, రెడ్ బుక్ రాజ్యాంగం అమలుతో ప్రజలు ఓటు వేయడానికి పోలీసులను వేడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వైఎస్సార్ సీపీ వాళ్లను కాల్చి పారేస్తామని పోలీసులే బహిరంగంగా బెదిరించారన్నారు. ఆ ఎన్నికలను తక్షణమే రద్దు చేసి నిష్పక్షపాత వాతావరణంలో మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఒక్క జెడ్పీటీసీ సీటు కోసం ఇంతటి అరాచకాలకు టీడీపీ పాల్పడిందన్నారు. వారి ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేదనటానికి ఇదే నిదర్శమన్నారు.

విశ్వశాంతి కోసం ధ్యాన సాధన



రంగంపేట పిరమిడ్ కేంద్రంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భ్రమరాంబ తదితరులు

రంగంపేట: విశ్వశాంతి కోసం మూడు రోజులు ధ్యాన సాధన చేయాలని రంగంపేట దుర్గమాంబ పిరమిడ్ సొసైటీ ధ్యాన కేంద్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు ఉండవల్లి భ్రమరాంబిక కోరారు. స్థానిక పిరమిడ్ కేంద్రంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ అద్భుతమైన కాస్మిక్ సైకిల్‌ను మూడు ప్రధాన ఖగోళ చక్రాలు కాస్మిక్, గెలాక్సీ, సోలార్ సైకిల్స్ అమరికలు ఒకేసారి శక్తివంతంగా రానున్నాయన్నారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని 12:21 అసెన్షన్ పోర్టల్ ఆక్టివేషన్ సామూహిక ధ్యానం ద్వారా భూమిపై శుభ మార్పులను ఆహ్వానించడానికి స్కూల్ ఆఫ్ అసెన్షన్ ఫౌండర్ శ్రీలక్ష్మి దుగ్గిరాల పిలుపు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమానికి మతపరమైన సంబంధం లేదని, ధ్యాన అనుభవం అవసరం లేదని, కేవలం 20 నిమిషాలు విజువలైజేషన్ చేయగలగాలన్నారు. అనంతరం విశ్వ శ్రేయస్సు కోసం సుమారు గంటకు పైగా సామూహికంగా ధ్యానం చేశారు. కార్యక్రమంలో పిరమిడ్ సొసైటీ సభ్యులు స్వర్ణ లక్ష్మి, దుర్గ, నాగమణి, లక్ష్మి, శ్రీనివాస్, వరలక్ష్మి, సత్యవాణి పాల్గొన్నారు.

అవయవదానంలో వెనుకంజ



మంత్రి సత్యకుమార్ యాదవ్

రాజానగరం: అవయవాల మార్పిడిలో అమెరికా, చైనాల తర్వాత మూడో స్థానంలో ఉన్న భారత్.. అవయవ దానంలో మాత్రం 68వ స్థానంలో ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. అంతర్జాతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా జీఎస్‌ఎల్ వైద్య కళాశాలలో 'జీవన్ దాన్ ఏపీ' పేరిట మంగళవారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ అవయవదానంపై ప్రజలను చైతన్యపరచాలన్నారు. జీవన్ దాన్ ఏపీ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అవయవ దానాలు, మార్పిడులపై వివరణాత్మకంగా ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం జీఎస్‌ఎల్‌లో ఏర్పాటుచేసిన 13 ఆపరేషన్ థియేటర్లను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, జీఎస్‌ఎల్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, రాజమండ్రి ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ విజయభాస్కర్, అడిషనల్ సూపరింటిండెంట్ సుబ్బారాయుడు పాల్గొన్నారు.

భవనానికి శంకుస్థాపన : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ప్రాంగణంలో నిర్మించనున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (బీపీహెచ్‌యూ) భవనానికి మంత్రి సత్యకుమార్‌యాదవ్ మంగళవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా టీబీ రోగులకు కిట్లు పంపిణీ చేశారు.

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ



కొంకుదురులో ర్యాలీ చేస్తున్న సర్పంచ్ వీరమణి తదితరులు

బిక్కవోలు: జాతీయ సమైక్యతను చాటి చెప్పే లా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేయాలని కొంకుదురు సర్పంచ్ సత్తి వీరమణి అన్నారు. ఆ గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేయాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించిన మహనీయులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, ఎంపీటీసీ నల్లమిల్లి అమ్మిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి . కర్రి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల యువజన అధ్యక్షుడు ఎస్వీ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా సచివాలయం సిబ్బంది కేక్ కట్ చేశారు.

రంగనాథన్‌కు నివాళి

బిక్కవోలు: భారతదేశ గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని మంగళవారం కొంకుదురు గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఎస్.బాల పూలమాల వేసి నివాళులర్పించారు.

రంగంపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని గ్రంథాలయాధికారి నల్లమిల్లి రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

అవగాహన

సీతానగరం: లైంగిక వేధింపులు - నివారణ చర్యలు అనే అంశంపై మంగళవారం సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వీవీ సుబ్బారావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

● మాజీ సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

అనపర్తి: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం ప్రముఖులు కలిశారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా స్పష్టమైన, ధైర్యవంతమైన నిర్ణయం తీసుకుని, మైనార్టీల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ముస్లింల సంక్షేమం కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. జగన్‌ను కలిసిన వారిలో షేక్ ఇబ్రహీం, షేక్ నయాబ్ రసూల్, షేక్ జాఫర్, షేక్ లాలాసాహెబ్, మత్సా వీరభద్రరావు, వేము చిరంజీవి, పంతం తారకరామ్, సత్తి రామారెడ్డి, యాసరపు శ్రీనివాసు, కోనాల రామకృష్ణారెడ్డి, గాజంగి వీరబాబు, బత్తుల రవికుమార్ ఉన్నారు.



మాజీ సీఎం జగన్‌ను కలిసిన డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, నాయకులు

విద్యార్థి దశ అత్యంత కీలకం



నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో మొక్క నాటి, నీరు పోస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

రాజానగరం: జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని, దాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత విద్యార్థులకు సూచించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ వీక్ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ మాట్లాడుతూ యూనివర్సిటీలో స్నేహపూర్వక వాతావరణాన్ని కొనసాగించే దిశగా ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలగాలన్నారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తితో కలిసి ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిక్కవోలు: ర్యాగింగ్‌కు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ హెచ్చరించారు. బిక్కవోలులోని శ్రీప్రజ్ఞ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్‌కు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఓదూరి శ్రీను పాల్గొన్నారు.

'సత్యసాయి' జలాల విడుదల

సీతానగరం: పురుషోత్తపట్నంలోని సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు కార్మికులు విధులకు హాజరుకావడంతో మంగళవారం గోదావరి సురక్షిత తాగునీటి విడుదల మొదలైంది. తమ 19 నెలల జీతాలు అందించాలంటూ ఆ ప్రాజెక్టు కార్మికులు గత నెల 8న రాజమహేంద్రవరంలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ మేరకు అధికారులతో సోమవారం జరిపిన చర్చలు సఫలం కావడంతో మంగళవారం కార్మికులు విధులకు హాజరయ్యారు. దీంతో సీతానగరం, గోకవరం, దేవీపట్నం, కోరుకొండ, రాజానగరం మండలాల్లోని 90 గ్రామాలకు నీటి సరఫరా జరిగింది. కాగా.. కార్మికుల యూనియన్ అధ్యక్షుడు పాలాడి శ్రీనివాస్, కార్యదర్శి యు.ఇస్సాక్ మాట్లాడుతూ వారం రోజుల్లో ఏడు నెలల జీతాలు అందిస్తామని, మిగిలిన బకాయిలను నెలాఖరులోపు చెల్లిస్తామని చెప్పారన్నారు. అలాగే ఈఎస్ఐ, పీఎఫ్ అందించేందుకు అంగీకారం తెలిపారన్నారు.